## క్లుప్తంగా

### మైక్ సెట్ బహూకరణ

**బచ్చన్నపేట:** మండలంలోని వంగ సుదర్శన్ రెడ్డి నగర్‌లోని దుర్గామాత ఆలయానికి దాత పండుగ ఉమాసుధాకర్ దంపతులు మైక్ సెట్‌ను బహూకరించినట్లు సర్పంచ్ కోనేటి స్వామి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన సుధాకర్ తన తల్లి పండుగ యాదమ్మ జ్ఞాపకార్థం రూ.20 వేల విలువైన మైక్ సెట్‌ను ఆలయానికి అందించారన్నారు. ఆలయ కమిటీ తరుపున దాతను అభినందించి సన్మానించారు. గొడుగు శ్రీనివాస్, పుట్ట నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

### ఉంగరం అప్పగింత



**స్టేషన్‌ఘన్‌పూర్:** మండలంలోని తాటికొండలో శ్రీకనకదుర్గమ్మ గుడి వద్ద ఓ మహిళ పోగొట్టుకున్న దాదాపు రూ. 30వేల విలువైన బంగారు ఉంగరాన్ని పంచాయతీ కార్మికుడు మారపాక ఏలియా అందించి తన నిజాయితీని చాటుకున్నాడు. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలో నిర్వహించిన కనకదుర్గమ్మ అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం గుడివద్దకు వెళ్లిన గ్రామానికి చెందిన పండుగ లాస్య తన బంగారు ఉంగరం (అర్ధతులం) పోగొట్టుకుంది. అయితే శనివారం గుడి వద్ద ఊడుస్తుండగా ఏలియాకు ఉంగరం దొరికింది. వెంటనే ఆలయ కమిటీ నిర్వాహకులు, వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డికి సమాచారం అందించాడు. దాంతో వారు లాస్యను పిలిచి ఉంగరాన్ని అందించారు. అనంతరం ఏలియాను సర్పంచ్ ఉమా సుధీర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ సుధీర్‌రెడ్డి, ఆలయ కమిటీ నిర్వాహకులు శాలువతో సన్మానించి అభినందించారు. ఉపసర్పంచ్ రాములు, మాజీ సర్పంచ్ సంధ్య, ఆలయ కమిటీ బాధ్యులు పాల్గొన్నారు.

### రుణాలు సకాలంలో చెల్లించాలి



**బచ్చన్నపేట:** బ్యాంకులో రుణాలు తీసుకున్న ఖాతాదారులు వాయిదాలను సకాలంలో చెల్లించాలని మండలంలోని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ శివ శంకర్ అన్నారు. శనివారం మండలంలోని బసిరెడ్డిపల్లిలో బ్యాంక్ బీమా పట్ల ప్రతి ఒక్కరూ తమ కుటుంబ రక్షణార్థం బీమా చేసి ధీమాగా ఉండాలని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. సర్పంచ్ బాలగోని పర్శరాములుగౌడ్, బీసీ మల్లం శోభ, సీఏ అనూష, బ్యాంకు సిబ్బంది రాజు , లింగారెడ్డి, శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

### నివాళి

**రఘునాథపల్లి:** మండలంలోని వెల్దికి చెందిన కొయ్యడ శ్రీనివాస్ అనారోగ్యంతో మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే రాజయ్య శనివారం పార్టీ నాయకులతో కలిసి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అంతిమయాత్రలో పాల్గొని కుటుంబ సభ్యులను ఓదార్చి రూ.5 వేల ఆర్థికసాయం అందజేశారు. సర్పంచ్ మల్లేష్, బీఆర్ఎస్ నాయకులుఉన్నారు.

### ప్లీనరీకి తరలిన కవులు

**జనగామ రూరల్:** విజయవాడలో ఆదివారం నిర్వహించనున్న శ్రీశ్రీ కళావేదిక ప్లీనరీ సమావేశాలకు శనివారం ఆ వేదిక జిల్లా కమిటీ సభ్యులు, కవులు తరలివెళ్లారు. జిల్లా అధ్యక్షుడు లగిశెట్టి ప్రభాకర్, కార్యదర్శి పెట్లోజు సోమేశ్వారాచారి, పొట్టబత్తిని భాస్కర్, సదానందం, అంబాల శివనాథ్, చిలుమోజు సాయి కిరణ్, జి కృష్ణ, కొట్టె శ్రీలత, బుదారపు లావణ్య, రామచంద్రం ఉన్నారు.

### బోరు పనులు ప్రారంభం



**చిల్పూరు:** మండలంలోని ఫత్తేపూర్‌లోని దుర్గామాత ఆలయం వద్ద శనివారం బోర్ పనులను సర్పంచ్ బానోత్ రూప్లానాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి ఎమ్మెల్సీ కడియం శ్రీహరిని కలిసి నిధులు మంజూరు చేయాలని కోరడంతో స్పందించారన్నారు. అందులో భాగంగా బోర్ పనులు ప్రారంభించామని తెలిపారు. దుర్గామాత ఉత్సవాలకు వచ్చే భక్తుల కోసం బోర్ వేయించడం జరిగిందన్నారు. కడియం యువసేన నాయకుడు జక్కుల రాజయ్య, బాపు నాయక్, రవి, భిక్షపతి, శంకర్, మధు, బాలరాజు, మోహన్, అంజి పాల్గొన్నారు.

### బొడ్రాయి..

**చిల్పూరు:** మండలంలోని లింగంపల్లిలో శనివారం బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన పనులను ఉత్సవ కమిటీ చైర్మన్ గంగుల సంపత్‌రెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గ్రామస్తులు, దాతల సాయంతో నూతన బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉత్సవాలను జూన్ 7,8,9న నిర్వహించనున్నట్లు తెలిపారు. సర్పంచ్ రవీందర్, ఎంపీటీసీ రవీందర్, ఉప సర్పంచ్ కంకటి రాజన్న, గౌరవ అధ్యక్షుడు రావులపల్లి చంద్రమౌళి, ప్రజలు, దాతలు పాల్గొన్నారు.

# కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలి



కొడకండ్ల: సమ్మెకు సంఘీభావం తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు



బచ్చన్నపేటలో.. ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ రాజశేఖర్

**కొడకండ్ల:** గ్రామ పంచాయతీల జూనియర్, ఔట్ సోర్సింగ్ కార్యదర్శులను ప్రభుత్వం వెంటనే రెగ్యులరైజ్ చేయాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ధరావత్ సురేష్‌నాయక్ డిమాండ్ చేశారు. రెగ్యులరైజ్ చేయాలనే డిమాండ్‌తో పంచాయతీ కార్యదర్శులు చేస్తున్న సమ్మెకు శనివారం కాంగ్రెస్ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి ఎనలేని సేవలందిస్తున్న కార్యదర్శులకు ప్రభుత్వం నియామక సమయంలో తెలిపిన ప్రకారం రెగ్యులరైజ్ చేయాలని కోరారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు రవిందర్, నాయకులు మహేందర్‌రెడ్డి, అంజయ్య, భిక్షపతి, ఖలీం, రమేష్, రాజు, యాకేష్, రంగయ్య, సక్రునాయక్ పాల్గొన్నారు.

**కొనసాగుతున్న కార్యదర్శుల సమ్మె**

**బచ్చన్నపేట:** పంచాయతీ కార్యదర్శులు తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట తొమ్మిదో రోజు సమ్మెను కొనసాగించారు . ఈ సందర్భంగా కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షుడు ప్రశాంత్ ఆచార్య మాట్లాడుతూ కార్యదర్శుల ప్రొబేషనరీ కాలం గడిచిపోతున్నా పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వం వెంటనే తమ సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యదర్శుల సమ్మెకు వంగ సుదర్శన్‌రెడ్డి నగర్ సర్పంచ్ కోనేటి స్వామి, ఇటుకాలపల్లి ఉప సర్పంచ్ బియ్య అశోక్, ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ పైస రాజశేఖర్‌లు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో రాధాకృష్ణ, కిరణ్‌కుమార్, సతీష్‌రెడ్డి, కర్ణాకర్, రాజశేఖర్, రేవతి. కవిత, రుబీనా పాల్గొన్నారు.



రఘునాథపల్లి: చీపుర్లతో ఊడుస్తూ నిరసన తెలుపుతున్న జేపీఎస్‌లు

**కార్యదర్శులపై ప్రభుత్వ నిర్లక్ష్యం వీడాలి**

**దేవరుప్పుల:** న్యాయపరమైన హక్కుల సాధన కోసం ఆందోళన చేస్తున్న పంచాయతీ జూనియర్ కార్యదర్శుల సమస్యల పరిష్కారం పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యవైఖరి తగదని సీనియర్ పీఎస్, హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు జిలుకర వెంకన్న, అంజలి, రామకృష్ణనాయక్ విమర్శించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయం వద్ద జూనియర్ కార్యదర్శుల సమ్మెకు వారు మద్దతు పలికి మాట్లాడారు. నాగరాణి, ఫర్జానా, శ్వేత, సంధ్యరాణి, వాణిశ్రీ, అశ్విని, సతీష్, అనిల్ నాయక్, శ్రీకాంత్, అమరేందర్, ప్రవీణ్ పాల్గొన్నారు.

**చీపుర్లతో ఊడుస్తూ నిరసన**

**రఘునాథపల్లి:** తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన నిరవధిక సమ్మె కొనసాగుతోంది. సమ్మెలో భాగంగా మండల పరిషత్ ముందు పంచాయతీ కార్యదర్శులు చీపుర్లు చేతబట్టి ఊడుస్తూ తమ నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర సమన్వయకర్త భూక్యా లింగం, జిల్లా ఉపాధ్యక్షుడు మహేందర్‌సుఖేష్, మండల అధ్యక్షుడు మహేష్, పంచాయతీ కార్యదర్శులు దీపిక, కవిత, బాను, త్రివేణి, శ్రీలత, మధు, నరేష్, అక్తర్, శివ, రమేష్‌రెడ్డి, రాజీవ్,నర్సింహ పాల్గొన్నారు.

**కార్యదర్శుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తాం..**

**జఫర్‌గఢ్:** గ్రామాల్లో పని చేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమస్యలను ఎమ్మెల్యే ద్వారా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని ఎంపీపీ రడపాక సుదర్శన్ అన్నారు. జేపీఎస్‌లను రెగ్యూలర్ చేయాలని కోరుతూ స్థానిక మండల పరిషత్‌కార్యాలయం ఎదుట చిల్పూరు, స్టేషన్‌ఘన్‌పూర్, జఫర్‌గఢ్ మండలాలకు చెందిన కార్యదర్శులు చేపట్టిన సమ్మె శనివారం 9వ రోజుకు చేరింది. సమ్మెకు ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యురాలు ఇల్లందుల బేబి శ్రీనివాస్, సింగిల్ విండో చైర్మన్ తీగల కర్ణాకర్‌రావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు మద్దతు ప్రకటించారు. కాగా, సమ్మె చేస్తున్న పంచాయతీ కార్యదర్శులకు ఆయా గ్రామాల సర్పంచ్‌లు రూ.20 వేలు అందజేశారు.

**పాలకుర్తిలో..**

**పాలకుర్తి టౌన్:** జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలని సీపీఎం(ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి మామిండ్ల రమేష్‌రాజా రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాలకుర్తిలో జేపీఎస్‌లు చేపట్టిన సమ్మెకు ఆయన మద్దతు తెలిపి మాట్లాడారు. బుజేందర్, సోమయ్య ఉన్నారు.

# అకాల వర్షాలతో రైతులకు నష్టం



మాట్లాడుతున్న ఎంపీపీ సుదర్శన్

**జఫర్‌గఢ్:** అకాల వర్షాలు రైతులకు అపార నష్టాన్ని కలిగించాయని ఎంపీపీ రడపాక సుదర్శన్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ముందుగా ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మొగులుగాని చంద్రయ్యకు సభలో సభ్యులు మౌనం పాటించి సంతాపాన్ని తెలిపారు. అనంతరం వ్యవసాయ శాఖ, ప్రజారోగ్యం, ఉపాధి హామీ, విద్యుత్, పశు సంవర్థక, ఉద్యానవన తదితర శాఖల పనితీరుపై సభలో చర్చించారు. వ్యవసాయ శాఖ పనితీరుపై ఏఓ దీప్తి మాట్లాడుతుండగా ఎంపీటీసీ సభ్యులు ఎడ్ల వెంకటస్వామి జోక్యం చేసుకొని అకాల వర్షాల వల్ల వరి తదితర పంటలు దెబ్బతిని రైతులకు తీవ్ర నష్టం జరిగిందన్నారు. ఎంపీపీ సుదర్శన్ మాట్లాడుతూ అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతులు ఎలాంటి ఆందోళన చెందొద్దన్నారు. ప్రతీ గింజను ప్రభుత్వం తప్పనిసరిగా కొనుగోలు చేస్తుందన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు బేబి శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ గుజ్జరి రాజు, సింగిల్ విండో చైర్మన్ తీగల కర్ణాకర్‌రావు తదితరులు మాట్లాడారు. ఎంపీడీఓ శ్రీధర్‌స్వామి, తహసీల్దార్ స్వప్న, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# భవన నిర్మాణ కార్మికులు సంఘటితం కావాలి



మాట్లాడుతున్న కొమురయ్య

**రఘునాథపల్లి:** భవన నిర్మాణ రంగాల కార్మికులు తమ హక్కుల సాధన కోసం సంఘటితం కావాలని సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి రాసమల్ల కొమురయ్య పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో జరిగిన భవన నిర్మాణ కార్మికుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అన్ని రంగాల్లో వెనుకబడిన భవన నిర్మాణ రంగాల కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులు ప్రమాదవశాత్తు మృతిచెందితే రూ 10 లక్షల ఎక్స్‌గ్రేషియా, 50 ఏళ్లు నిండిన కార్మికులకు నెలకు రూ 5 వేల పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నెల 7న జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న మేడే ఉత్సవాల సదస్సుకు ప్రతి ఒక్కరూ హాజరుకావాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు వాతల యాదగిరి, జిల్లా కోశాధికారి తూడి అంజయ్య, చిన్నపాక వెంకటరత్నం, గోవింద్ రవి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా హనుమాన్ శోభాయాత్ర



నర్మెట: శోభాయాత్రలో హనుమాన్ మాలధారులు



బచ్చన్నపేట: నగర సంకీర్తన చేస్తున్న స్వాములు

**నర్మెట:** దీక్షలు చేపట్టిన హనుమాన్ భక్తులు శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన శోభాయాత్రతో రామనామంతో పురవీధులు మారుమోగాయి. మండల దీక్షలు చేపట్టిన స్వాములు ఈనెల 14న దీక్ష విరమణ చేయనుండగా ప్రతీ శనివారం హనుమాన్ భారీ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి యాత్ర అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేస్తున్నారు. శనివారం నిర్వహించిన ఈ యాత్రలో స్వాములు, బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు ధరావత్ రాజు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

**నగర సంకీర్తన**

**బచ్చన్నపేట:** మండల కేంద్రంలో హనుమాన్ మాలాధారణ స్వాములు శనివారం ఘనంగా నగర సంకీర్తన నిర్వహించారు. ప్రధాన చౌరస్తా వద్ద హనుమాన్ ఆలయం ముందు ఉన్న పెద్ద ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద పూజలను నిర్వహించి రామ లక్ష్మణ జానకీ జై బోలో హనుమాన్‌కీ.. అంటూ భజన భక్తి పాటలు పాడుకుంటూ పట్టణంలో పలు వీధుల్లో తిరిగారు. ఈ స్వాములకు మహిళలు హారతులను పడుతూ పాదాల వద్ద బిందెలతో నీళ్లు పోశారు. స్వాములు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఎస్సీ వర్గీకరణకు మద్దతు ప్రకటించాలి

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్



మాట్లాడుతున్న గోవిందు నరేష్

**స్టేషన్‌ఘన్‌పూర్:** తెలంగాణ భరోసా సభలో పాల్గొనడానికి వస్తున్న బీఎస్‌పీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి ఎస్సీ వర్గీకరణకు మద్దతు ప్రకటించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు డివిజన్ కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో శనివారం ప్లకార్డులతో ప్రదర్శన చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ లేక ఏడు దశాబ్దాలుగా విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో మాదిగ, మాదిగ ఉపకులాలు తీవ్రంగా నష్టపోయాయన్నారు. ఉమ్మడి రిజర్వేషన్ విధానం ఒక్క కులం ఏకపక్ష దోపిడీకి ఉపయోగపడుతోందని, అందుకే మంద కృష్ణమాదిగ నాయకత్వంలో వర్గీకరణ కోసం ఉద్యమిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి బొర్ర భిక్షపతి, జిల్లా కన్వీనర్ పైస రాజశేఖర్, ఎంఎస్పీ నాయకులు నలిమెల నాగరాజు, గోవిందు ఇసాక్, ఈర్ల కుమార్, మంద శ్రీనివాస్, సందెన రవీందర్, స్వామి, రాంచందర్, భాస్కర్, శాంతిసాగర్, శ్రావణ్‌తోపాటు పాల్గొన్నారు.

## చివరిగింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది

**పాలకుర్తి టౌన్:** రైతులు పండించిన చివరి గింజ వరకు ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఎంపీపీ నల్లా నాగిరెడ్డి, జెడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాస్‌రావు అన్నారు. శనివారం మండలంలోని దర్దేపల్లి, కొండాపురం, మల్లంపల్లి, ముత్తారం, వల్మిడి గ్రామాల్లో ఐకేపీ, సొసైటీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అకాల వర్షాల కారణంగా ధాన్యం కొనుగోళ్లపై రైతులు ఆందోళన చెందుతున్న నేపథ్యంలోకొనుగోలు కేంద్రంలో రెండు కాంటాలు ఉండేవిధంగా చూసుకోవాలని, హమాలీల కొరత లేకుండా ఏర్పాట్లు చేయాలని అన్నారు.

# బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న దాతలు

**పాలకుర్తి టౌన్:** విస్నూరుకు చెందిన కైతోజు సాయి బావిలో ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు మృతి చెందాడు. కాగా, కుటుంబ పోషణ భారమై దీనస్థితిలో ఉన్న మృతుడి తల్లి పద్మకు శనివారం దాతలు రూ. 61 వేలు ఆర్థికసాయం అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. మృతుడి కుటుంబానికి రాష్ట్ర పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు రూ.10 వేలు, దేవరుప్పుల మండలం పెద్దమాదూరు గ్రామానికి చెందిన బబ్బూరి శ్రీకాంత్ రూ. 10 వేలు, విశ్వబ్రాహ్మణ సంఘం మండల కమిటి రూ. 20 వేలు, మహాత్మా హెల్పింగ్ హాండ్స్ వ్యవస్థాపకుడు గంట రవీందర్ రూ.5 వేలు, పాలకుర్తి సీఐ డి.విశ్వేశ్వర్ 5 వేలు, ఎస్సై తాళ్ల శ్రీకాంత్ 5 వేలు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్ రూ.3 వేలు, డాక్టర్ చుక్కా రామయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో గూడూరు మాజీ సర్పంచ్ మాచర్ల పుల్లయ్య రూ.3 వేలు ఆర్థికసాయం అందజేశారు.

**కోలుకొండలో..**

**దేవరుప్పుల :** మండలంలోని కోలుకొండలో మృతిచెందిన యామగాని యాదగిరి కుటుంబాన్ని బీజేపీ రాష్ట్ర నాయకుడు లేగ రాంమోహన్‌రెడ్డి శనివారం పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు భాగాల నవీన్ రెడ్డి, బండి రాజు, కేమిడి బాబు,రాజు, సదానందం తదితరులు ఉన్నారు.

## అనుచిత వ్యాఖ్యలు తగవు

**దేవరుప్పుల:** బీజేపీ నాయకులపై మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పాలకుర్తిలో చేసిన అనుచిత వ్యాఖ్యలు తగవని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు దుబ్బ రాజశేఖర్ విమర్శించారు. తెలంగాణ సాధనకు సంపూర్ణ సహకారాలు అందించిన బీజేపీని విమర్శించే నైతిక హక్కు మంత్రి ఎర్రబెల్లికి లేదన్నారు. బీజేపీ ప్రభుత్వం తెలంగాణ ప్రజలకు చేసిన ప్రయోజనాలపై తగు ఆధారాలతో విస్తృత అవగాహన కల్పించి ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న బీఆర్ఎస్‌కు ప్రజలు గుణపాఠం చెప్పేలా చేస్తామన్నారు.

# వైభవంగా జలాభిషేకం



స్టేషన్‌ఘన్‌పూర్: జలాభిషేకానికి వెళ్తున్న గౌడ కులస్తులు



రఘునాథపల్లి: బొడ్రాయికి జలాభిషేకం చేస్తున్న సర్పంచ్ శివకుమార్ దంపతులు, తదితరులు



దేవరుప్పల: జలాభిషేకం చేస్తున్న మహిళలు

**స్టేషన్‌ఘన్‌పూర్:** మండలంలోని ఇప్పగూడెం ఆలయంలో నిర్వహిస్తున్న గౌడ కులస్తుల ఆరాధ్యదైవమైన శ్రీ కంఠమహేశ్వరస్వామి-సురమాంబదేవి, రేణుకా ఎల్లమ్మ, జమదగ్ని మహర్షి విగ్రహ ప్రతిష్ఠాపన, కల్యాణ మహోత్సవాల్లో భాగంగా శనివారం వైభవంగా జలాభిషేకం నిర్వహించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ మందపురం ఎల్లగౌడ్ ఆధ్వర్యంలో కమిటీ బాధ్యులు, గౌడ కులస్తులు అధిక సంఖ్యలో హాజరై పూజలను చేపట్టారు. గౌడ కులస్తులు తమ ఇళ్ల వద్ద నుంచి బిందెలలో నీరు తీసుకుని వాటిలో పంచామృతాలు వేసి సామూహికంగా డప్పు చప్పుళ్లతో ర్యాలీగా ఎల్లమ్మ గుడి వద్దకు వెళ్లారు. భక్తిశ్రద్ధలతో జలాభిషేకం నిర్వహించారు. కల్యాణ ఉత్సవ కమిటీ చైర్మన్ మందపురం ఎలగౌడ్, గౌరవ అధ్యక్షురాలు, ఎంపీటీసీ గండి విజయలక్ష్మీ, వర్కింగ్ ప్రెసిడెంట్, పీఏసీఎస్ డైరెక్టర్ చట్ల యాకయ్య, గౌడ సంఘం అధ్యక్షుడు చట్ల యాదగిరి, వర్కింగ్ ప్రెసిడెంట్లు పల్లె రవీందర్, పల్లె లక్ష్మీనారాయణ, కుర్ర ఉప్పలయ్య పాల్గొన్నారు.

**బొడ్రాయికి..**

**రఘునాథపల్లి:** మండల కేంద్రంలో కొనసాగుతున్న గ్రామ దేవతల ఉత్సవాల్లో భాగంగా మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో బొడ్రాయికి జలాభిషేకం చేశారు. సర్పంచ్ పోకల శివకుమార్ ఆధ్వర్యంలో నూతన ఆలయాల్లో ప్రతిష్ఠించిన శ్రీ విజయదుర్గాదేవి, ఎల్లమ్మ, పోచమ్మ, ముత్యాలమ్మ, మైసమ్మ దేవతా మూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. ఇంటింటి నుంచి మహిళలు నీళ్ల బిందెలతో బొడ్రాయి వద్దకు వెళ్లి జలాభిషేకం చేసి మొక్కుకున్నారు. ఆదివారం ముత్యాలమ్మ, పోచమ్మ, మైసమ్మ దేవతలకు బోనాలు చేయనున్నట్లు సర్పంచ్ శివకుమార్ తెలిపారు. ఉప సర్పంచ్ యాద రాములు, నిర్వాహణ కమిటీ సభ్యులు నిర్వాహణ కమిటీ సభ్యులు పోరెడ్డి రాఘవరెడ్డి, నాగేష్ ఉన్నారు.

**దేవరుప్పులలో..**

**దేవరుప్పుల:** మండల కేంద్రంలో గ్రామ సంస్కృతికి ప్రతీకకు నిదర్శనమైన బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన పురస్కరించుకొని శనివారం ఇంటింటా ఆడపడుచులు రాగి బిందెల్లో నీటిని నెత్తిన ఎత్తుకొని ప్రదర్శన చేసి జలాభిషేకం చేశారు. పూజారులు ఉప్పల రమేష్‌శర్మ, పెద్దాపురం వెంకటేశ్వర శర్మ, దేశగురువు ధనుంజయరెడ్డిలు వేర్వేరుకు ప్రతిష్ఠాపన ప్రత్యేక పూజలు చేశారు. బొడ్రాయితోపాటు ఆయా సామాజికవర్గాల గ్రామ దేవతలకు ఇంటిల్లిపాది కలిసి మొక్కులు చెల్లించుకున్నారు. సర్పంచ్ రమాదేవి, ఉపసర్పంచ్ దశరథ, ఎంపీటీసీ రేణుక కిష్టయ్య, నర్సింహారెడ్డి, తీగల దయాకర్ పాల్గొన్నారు.

# నిరుద్యోగులను మోసం చేసిన ప్రభుత్వం



అభివాదం చేస్తున్న నాయకులు

**జనగామ రూరల్:** రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేసి వారి జీవితాలతో చెలగాటం అడుకుంటుందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఈర్ల కొమురయ్య అన్నారు. శనివారం పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో పొన్నాల లక్ష్మయ్య ఆదేశాల మేరకు ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొమురయ్య మాట్లాడారు. ప్రభుత్వం అవలంబిస్తున్న నిరుద్యోగ విధానాలపై నిర్వహించే నిరుద్యోగ జంగ్ సైరన్ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. చెంచారపు శ్రీనివాస్‌రెడ్డి, మాసన్ పల్లి లింగాజీ, నర్సయ్య, ఇందిరా, నారాయణరెడ్డి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## బ్లాక్ క్రేన్స్ సందడి

మండల కేంద్రంలోని నల్లచెరువు ఆయకట్టు కింద వరికోత పనులు పూర్తయ్యాయి. ఈ క్రమంలో ధాన్యపు గింజల వేటకోసం మూకుమ్మడిగా వచ్చిన బ్లాక్ క్రేన్స్ శనివారం 'సాక్షి' కెమెరాకు చిక్కాయి. వాస్తవానికి తెల్లకొంగలు ఆహార వేటకు వస్తూ ఉంటాయి. అయితే ఇక్కడ నల్ల రంగు కలిగిన కొంగలు వేల సంఖ్యలో వచ్చి సందడి చేశాయి.

- దేవరుప్పుల



## బేలర్‌లో పడి తెగిన చెయ్యి

**స్టేషన్‌ఘన్‌పూర్:** గడ్డి కట్టలు చుట్టే యంత్రం(బేలర్)లో పడి గండి వెంకటమల్లు అనే వ్యక్తి ఎడమ చెయ్యి తెగిన సంఘటన మండలంలోని కొత్తపల్లిలో శనివారం జరిగింది. వివరాలు.. కొత్తపల్లికి చెందిన వెంకటమల్లుకు గడ్డి కట్టలు చుట్టే యంత్రం ఉంది. గ్రామంలోని పులిగిళ్ల కుమారస్వామి వ్యవసాయ క్షేత్రంలో శనివారం గడ్డి కట్టలు చుట్టేందుకు వెళ్లాడు. గడ్డి కట్టలు చుడుతుండగా యంత్రంలో దారం తెగిపోవడాన్ని గుర్తించాడు. దానిని సరిచేసేందుకు కిందికి దిగి సరిచేసేందుకు ప్రయత్నించాడు. మిషన్‌ను పూర్తిగా ఆఫ్ చేయకపోవడంతో ప్రమాదవశాత్తు ఒక్కసారిగా ఎడమచేయి అందులోకి వెళ్లి నుజ్జునుజ్జయింది. గమనించిన స్థానికులు వెంటనే అతడిని చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

## ఉచిత కుట్టు శిక్షణ శిబిరాలు



సిద్ధంగా ఉన్న కుట్టు మిషన్లు

**నర్మెట:** మండలం కేంద్రంతో పాటు ఆరు గ్రామాల్లో మహిళలకు ఉచిత కుట్టుమిషన్ శిక్షణా శిబిరాలను ఏర్పాటు చేయనున్నట్లు సెంటర్ ఫర్ అర్బన్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ నిర్వాహకులు అగ్రహారం వెంకట రమణమూర్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సీయూఆర్‌డీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వారానికి ఐదు రోజుల శిక్షణతోపాటు భోజన వసతి ( వారానికి ఒక్క రోజు చికెన్, రెండు రోజులు గుడ్డుతో ) ఉంటుందన్నారు. శిక్షణ అనంతరం ప్రతీ మహిళకు కుట్ట మిషన్ ఉచితంగా అందజేయబడుతుందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఏర్పాటు చేయనున్న టెక్స్‌టైల్ పార్కులలో మహిళలు ఉద్యోగాలు పొందవచ్చని అందుకు ఏర్పాట్లు తమ సంస్థ చేస్తుందని తెలిపారు. మండలకేంద్రంలో 75 మిషన్లతో 150 మంది ఒక బ్యాచ్‌గా సోమవారం ప్రారంభిస్తామని అనంతరం మచ్చుపహాడ్, హన్మంతాపూర్, బొమ్మకూర్, అమ్మాపూర్‌లలో 25 మిషన్లతో 50 మందికి ఉచిత శిక్షణ ఇవ్వడం జరుగుతుందని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
జనగామ :
9951602871
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
డి.సత్యం (S.R) : 8008671692 (పాలకుర్తి)
యం.డి. ఖలీల్ (S.R) : 8179719313 (జనగామ)
జి. రవియాదవ్ (A.C.O) : 9032782191